క్లుప్తంగా

వీఆర్‌ఏ మృతికి సంతాపం

ఆత్మకూర్(ఎస్) : మండల పరిధిలోని ముక్కుడుదేవులపల్లి గ్రామానికి చెందిన వీఆర్‌ఏ దాసరి నర్సయ్య (61)అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. నర్సయ్య మృతికి రెవెన్యూ సిబ్బంది సంతాపం తెలిపారు. అతడి దహన సంస్కారాల కోసం రెవెన్యూ కార్యాలయం తరఫున రూ.20వేలు అందించారు.

సూర్యక్షేత్రంలో పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో ఆదివారం ప్రత్యేక పూజలు కొనసాగాయి. తెల్లవారుజామున ఉషాపద్మిని ఛాయ సమేత సూర్యనారాయణస్వామికి అభిషేకాలు జరిపారు. యజ్ఞశాలలో మహాసౌరహోమం నిర్వహించారు. క్షేత్రంలోని వీరహనుమాన్, శ్రీరామకోటి స్థూపాలను భక్తులు దర్శించుకున్నారు. వివిధ మాలధారులతోపాటు మహిళలు కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నప్రసాద సత్రంలో ఆదిత్య సేవా కేంద్రం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో క్షేత్ర వ్యవస్థాపకుడు జనార్దన్‌స్వామి, గణపురం నరేష్, ఇంద్రారెడ్డి, అర్చకులు భీంపాండే, శ్రీరాంపాండే, అంకిత్‌పాండే పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ



చెక్కు పంపిణీ చేస్తున్న నాయకులు

తిరుమలగిరి : తిరుమలగిరి మండలం వెలిశాల గ్రామానికి చెందిన సాకి రాములమ్మకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన రూ.40 వేల విలువైన చెక్కును ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకుడు కుంభం సంతీష్ గౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ తుంగతుర్తి శాసన సభ్యుడు సామేల్ సహకారంతో చెక్కు మంజూరైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు చెరుకు వేణురావు, మర్రి సోమిరెడ్డి, వీరారెడ్డి, ఉప్పలయ్య, శివ, సంపత్, యాకన్న, మల్లయ్య, కాంతయ్య, శంకర్, కార్తీక్, కృష్ణ పాల్గొన్నారు.

మాలమహానాడు నూతన కమిటీ ఎన్నిక



నియామకపత్రం అందజేస్తున్న నాయకులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల మాల మహానాడు నూతన కమిటీని ఆదివారం జాజిరెడ్డిగూడెంలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా పగిడిమర్రి శేఖర్, గౌరవ సలహాదారుగా పగిడిమర్రి సాల్మన్, ఉపాధ్యక్షుడిగా సంగెం సోమయ్య, కార్యదర్శిగా పి. శ్రీరాములు, కోశాధికారిగా రెంటాల కరుణకుమార్, ప్రధాన కార్యదర్శిగా మండల ప్రవీణ్, సభ్యులుగా గండమళ్ల యల్లయ్య, జి. అంబేద్కర్, బి. నరేష్, పి.సాయిలు, మహేష్, భిక్షం, దేవదానం, నర్సయ్య ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా డిసెంబర్ 1న జరిగే మాలల సింహగర్జన కరపత్రాలు, పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కోకన్వీనర్ గంట యాకూబ్, నియోజకవర్గ కన్వీనర్ శేఖర్, తిరుమలగిరి, నాగారం మండలాల అధ్యక్షులు సందీప్, జాన్ వెస్లీ, ప్రభుదాస్, సాల్మన్ పాల్గొన్నారు.

పెయింటర్స్ నూతన కమిటీ ఎన్నిక



వంగూరి కుమార్

నాగారం : మండల పెయింటర్స్ యూనియన్ నూతన కమిటీని ఆదివారం నాగారంలో నిర్వహించిన పెయింటర్స్ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల నూతన అధ్యక్షుడిగా ఈటూరు గ్రామానికి చెందిన వంగూరి కుమార్, గౌరవ అధ్యక్షుడిగా గద్దల సైదులు, ఉపాధ్యక్షులుగా దండోలు మహేష్, పాల్వాయి మహేష్, ప్రధాన కార్యదర్శిగా బర్ల సోమయ్య, కోశాధికారిగా దర్శనం సోమేష్, సహాయ కార్యదర్శులుగా పేరాల వినోద్, దేవరకొండ కృష్ణ, గద్దల జానయ్య, పేరాల లక్ష్మణ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అయ్యప్ప మాలధారులకు అన్నప్రసాద వితరణ

మునగాల : మునగాల మండల కేంద్రం శివారులోని శ్రీహరిహరసుత అయ్యప్ప ఆలయం ఆవరణలో గల అన్నప్రసాద వితరణ కేంద్రంలో ఆదివారం 165 మంది అయ్యప్ప మాలధారులకు అన్నదానం నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ తడకమళ్ల శ్రీనవాసచారి గురుస్వామి తెలిపారు. అన్నదానానికి మండల కేంద్రానికి చెందిన సూర్యప్రకాష్ –రమ్య దంపతులు(మునగాల), వల్లోజు వెంకటమ్మ కుమారుడు వెంకటకృష్ణ –జానకి దంపతులు(మునగాల), సారెడ్డి శ్రీనివాసరెడ్డి(మునగాల) సహకరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా దాతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు, అయ్యప్ప మాలధారులు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ.. పర్యవేక్షణ లేమి!

- కొత్త జీపీల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు లేకపోవడంతో ఇబ్బందులు
- పంచాయతీ కార్యదర్శులు, మేట్‌లతో నెట్టుకొస్తున్న దుస్థితి



లింగాల గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు(ఫైల్)

పెన్‌పహాడ్ : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్ల కొరత వేధిస్తోంది. కొన్ని గ్రామాల్లో పనుల నిర్వహణ, కూలీల హాజరు నమోదు, పనుల గుర్తింపునకు ఫీల్డ్ అసిస్టెంట్లు కరువయ్యారు. దీంతో పంచాయతీ కార్యదర్శులు, మేటీల ద్వారా ఉపాధి హామీ పథకం పనులను నెట్టుకొస్తున్నారు. పెన్‌పహాడ్ మండలంలో 29 గ్రామ పంచాయతీలు ఉండగా.. ప్రస్తుతం 17 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు మాత్రమే పనిచేస్తున్నారు. 12 కొత్త జీపీల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు లేకపోవడంతో ఉపాధి హామీ కూలీలకు ఇబ్బందులు తప్పడం లేదు. మండలంలో 12,341 జాబ్‌కార్డులు ఉండగా సుమారు 21,438 మంది కూలీలు ఉన్నారు.

కొరవడుతున్న పర్యవేక్షణ..

మండలంలోని 12 కొత్త జీపీల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు లేకపోవడంతో పనుల నిర్వహణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రతి ఏటా సుమారు రూ.8 కోట్లకు పైగా విలువ చేసే పనులు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో మూడు, నాలుగు చోట్ల ఒకే సమయంలో జరిగే పనులు, కూలీల హాజరుపై పర్యవేక్షణ కొరవడుతోంది. ప్రస్తుతం మండలంలో 2025–26 సంవత్సరానికి పనుల గుర్తింపు కోసం గ్రామసభలు నిర్వహించారు. రైతులకు ఉపయోగపడే పనులకు అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే ఉపాధి పనుల పర్యవేక్షణ పక్కాగా ఉండాలంటే సిబ్బంది కొరత లేకుండా ఉండాలని పలువురు పేర్కొంటున్నారు.

పనులకు ఆటంకం



కొత్త జీపీల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు లేక పంచాయతీ కార్యదర్శి, మేట్‌ల ద్వారా పనులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో సరైన పర్యవేక్షణ లేక పనుల నిర్వహణకు ఆటంకం కలుగుతుంది. కూలీలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్లకు పనిభారం పెరిగి ఒత్తిడికి గురవుతున్నారు. అధికారులు స్పందించి కొత్త జీపీలకు ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించాలి.

– గుంజా వెంకటేశ్వర్లు, సీపీఎం మండల కార్యదర్శి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



కొత్త పంచాయతీల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు లేక ఇబ్బందులు ఎదురవుతున్న విషయం వాస్తవమే. ఈ విషయాన్ని ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. సమస్యను మరోమారు వారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

– రవి, ఏపీఓ

ఉద్యమకారుల ఆకాంక్షలు నెరవేర్చడంలో విఫలం



పాదయాత్ర చేస్తున్న తెలంగాణ మలిదశ ఉద్యమకారులు

సూర్యాపేట : పోరాడి సాధించుకున్న తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంలో ఉద్యమకారుల ఆకాంక్షలను నెరవేర్చడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని మలిదశ తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు సామ అంజిరెడ్డి, మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు కుంట్ల ధర్మార్జున్ అన్నారు. ఉద్యమకారులకు తగిన గౌరవం కల్పించాలని కోరుతూ మలిదశ తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఊరూరా నిర్వహించే పాదయాత్రను ఆదివారం జిల్లా కేంద్రంలోని రైతుబజార్ అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత పదేళ్లు అధికారంలో ఉన్న టీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించడంలో తీవ్ర నిర్లక్ష్యం వహించిందన్నారు. ఉద్యమకారులను విస్మరించిన ఏ ప్రభుత్వానికైనా గుణపాఠం తప్పదని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ 1969 తొలిదశ ఉద్యమకారుల సంఘం నాయకులు బొమ్మిడి లక్ష్మీనారాయణ, మలిదశ తెలంగాణ ఉద్యమకారులు మిర్యాల వెంకటేశ్వర్లు, కొణతం అప్పిరెడ్డి, కోతి మాధవి, మధుసూదన్‌రెడ్డి, ఎస్‌కే.యాసుఫ్, కట్టోజు గోపి, మేడబోయిన గంగయ్య, కొత్తగట్టు యాకయ్య, సోమయ్య, గూడ సాయిగౌడ్, మోర శైలేందర్, ఏర్పుల రాములు పాల్గొన్నారు.

జాజిరెడ్డిగూడెం పంచాయతీ అధికారిగా గోపి



అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల పంచాయతీ అధికారి (ఎంపీఓ)గా టి.గోపి నియమితులయ్యారు. ఈయన మేళ్లచెరువు ఎంపీఓగా పనిచేస్తూ డిప్యుటేషన్‌పై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అంచెలంచెలుగా పరిష్కరించనున్నట్లు తెలిపారు. సమస్యలు ఉంటే ప్రజలు తమ దృష్టికి తేవాలని కోరారు.

కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయాలి

అర్వపల్లి : బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ సోమవారం అర్వపల్లికి రానున్నారని మాజీ జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్ తెలిపారు. కేటీఆర్ అర్వపల్లికి రానుండటంతో ఆదివారం ఏర్పాట్లను పరిశీలించి మాట్లాడారు. కేటీఆర్ మహబూబాబాద్‌కు వెళ్తూ అర్వపల్లిలో ఆగి ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారని చెప్పారు. ఈ సందర్భంగా ఆయనకు ఘన స్వాగతం పలుకనున్నట్లు తెలిపారు. కేటీఆర్‌తో పాటు మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ రానున్నారని చెప్పారు.

సెలవు రోజూ కొనసాగిన డేటా ఎంట్రీ



అర్వపల్లిలోని ఎంపీడీఓ కార్యాలయంలో డేటా ఎంట్రీ చేస్తున్న ఎన్యుమరేటర్లు, సీఓలు

అర్వపల్లి : సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే వివరాలను ఆన్‌లైన్ చేసే కార్యక్రమం మండలంలో ముమ్మరంగా జరుగుతోంది. ఆదివారం సెలవు రోజు కూడా ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో ఎన్యుమరేటర్లు, సీఓలు డేటా ఎంట్రీ కార్యక్రమాన్ని చేపట్టారు. రేయింబవళ్లు షిఫ్టుల పద్ధతిలో సీఓలతో డేటా ఎంట్రీ చేయిస్తున్నారు. మండలంలో సుమారు 4 వేలకు పైగానే కుటుంబాలకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. డేటా ఎంట్రీని ఎప్పటికప్పుడు తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి, ఎంపీఓ గోపి పర్యవేక్షిస్తున్నారు. ఈ కార్యక్రమంలో గిర్దావర్ పాటి వెంకట్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ సీహెచ్.నర్సింహరాజు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

కోదాడరూరల్ : కోదాడ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేసుకుంటూ ముందుకెళ్తున్నామని కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. మండలంలోని గణపవరం స్టేజీ నుంచి గ్రామంలోకి ఎంఆర్‌ఆర్ నిధులు రూ.50 లక్షలు, గణపవరం నుంచి ఎర్రవరం రోడ్డు వరకు సీఆర్‌ఆర్ నిధులు రూ.84 లక్షలతో చేపట్టనున్న బీటీ రోడ్డు పనులకు ఆదివారం ఆమె శంకుస్థాపన చేసి మాట్లాడారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు బీటీ రోడ్లతోపాటు మౌలిక వసతుల కల్పనకు అధిక నిధులు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఇర్ల సీతారాంరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ రేవూరి వెంకటాచారి, పీఆర్ ఏఈ రాము, జాబిశెట్టి ప్రసాద్, సింగారెడ్డి సుమన్‌రెడ్డి, నారపరెడ్డి, లక్ష్మారెడ్డి, నర్సింహారావు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు

తిరుమలగిరి : తిరుమలగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003–04 సంవత్సరం పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. చదువు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దామోదర్ రెడ్డి, వెంకటనారాయణ, దామోదర చారి, వెంకటేశ్వర్లు, సురేష్, గోవర్ధన్ రెడ్డి, సత్యనారాయణ, ఉప్పలయ్య, జోసఫ్, దామర శ్రీనివాస్, పూర్వ విద్యార్థులు శ్యామ్, మహేష్, నరేష్, సోమేష్, ఉపేంద్ర, రేణుక, స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

గౌడ సంఘం వన భోజనాలు

చిలుకూరు : మండల కేంద్రంలో ఆదివారం గౌడ సంఘం కార్తీక వన భోజన మహోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ముందుగా గౌడ కులస్తులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామ శివారులోని తోటలో ఉసిరి చెట్టుకు మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. పలువురు దంపతులు సత్యనారాయణ స్వామి వ్రతం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు గుండు వెంకటేశ్వర్లు, కడియాల వెంకటేశ్వర్లు, కొండా కోటయ్య, మండవ ఉపేందర్, కొండా వెంకయ్య, మండవ అచ్చయ్య, మల్లం వెంకటేశ్వర్లు, మండవ వీరబాబు పాల్గొన్నారు.



వ్రతం చేస్తున్న గౌడ కులస్తులు

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



కస్తూరిబా పాఠశాలలో సిబ్బందితో మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి ప్రసాద్

పెన్‌పహాడ్ : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మండల ప్రత్యేక అధికారి ప్రసాద్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాలను ఆయన సందర్శించారు. వంట గదులు, నిత్యావసర సరుకులు, విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని విద్యార్థినులకు సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ శ్రీలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సెంట్రల్ లైట్ల పునరుద్ధరణ



అర్వపల్లిలో వెలుగుతున్న సెంట్రల్ లైట్లు

అర్వపల్లి : అర్వపల్లిలో నకిరేకల్–తానంచర్ల 365 జాతీయ రహదారిపై ఎట్టకేలకు సెంట్రల్ లైట్లను పునరుద్ధరించారు. కొన్నిరోజులుగా అర్వపల్లిలో హైవేకు సంబంధించి తుంగతుర్తి, జాజిరెడ్డిగూడెం రోడ్ల నందు సెంట్రల్ లైట్లు వెలగక జాతీయ రహదారి అంధకారంగా మారింది. దీంతో వాహనచోదకులు, స్థానికులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. విషయాన్ని హైవే అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ఎన్‌హెచ్ విభాగం డీఈ ధరావత్ బాలునాయక్ స్పందించి రహదారి నిర్వహణ కంపెనీ వారితో మాట్లాడారు. లైట్లను మరమ్మతు చేయించి పునరుద్ధరించేలా చర్యలు తీసుకున్నారు. కాగా ఈ రూట్లో మరికొన్ని లైట్లు వెలగడం లేదని అన్ని లైట్లు వెలిగేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

సాంస్కృతిక సారథి బృందం కళాజాతా



చిల్పకుంట్లలో కళాజాత నిర్వహిస్తున్న కళాకారులు

నూతనకల్ : ప్రజా పాలన – ప్రజా విజయోత్సవాల్లో భాగంగా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని చిల్పకుంట్ల, తాళ్లసింగారం గ్రామాల్లో తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో కళాజాతా నిర్వహించారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా పలు సంక్షేమ పథకాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక సారథి జిల్లా అధ్యక్షుడు పెండెం నాగరాజు, ఇర్ల సైదులు, గడ్డం ఉదయ్, మాగి శంకర్, గజ్జి మంజుల, మేడిపల్లి వేణు, పోతరాజు శిరీష, రాధా, పంచాయతీ కార్యదర్శులు గంగరాజు, శర్మ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నిత్య అఖండ దీపారాధన



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

అర్వపల్లి : కార్తీకమాసం సందర్భంగా మండల పరిధిలోని పర్సాయపల్లి గ్రామంలో జంగాలబోడుపై ఉన్న భవాని సమేత జంగమేశ్వరస్వామి ఆలయంలో తొలిరోజు నుంచి నిత్య అఖండ దీపారాధనను కనులపండువగా నిర్వహిస్తున్నారు. కార్తీకమాసం మొదలైనప్పటి నుంచి నిత్యం ధ్వజస్తంభంపై దీపం వెలిగిస్తూ పూజలు చేస్తున్నారు. అలాగే కార్తీక దీపోత్సవం కూడా నిర్వహిస్తున్నారు. ఆదివారం ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు జరిపి దీపాలు వెలిగించారు. కార్యక్రమంలో అర్చకుడు మోత్కూరి రాజుశర్మ, భక్తులు జెట్టి కరుణాకర్, రాగి అనిల్, బోగోజు శ్రావణ్, కొప్పోజు వెంకన్న, కొత్త సంతోష్ రెడ్డి, బానోతు హుస్సేన్, మహిళలు పాల్గొన్నారు.

సన్న ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం



ఆత్మకూర్(ఎస్) : కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు



కొమ్మాలలో సన్న ధాన్యం కాంటాలను ప్రారంభిస్తున్న పంచాయతీ కార్యదర్శి

అర్వపల్లి : మండల పరిధిలోని కొమ్మాల గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్న ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఆదివారం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. సన్న ధాన్యానికి క్వింటాకు రూ.500 చొప్పున ప్రభుత్వం బోనస్ చెల్లిస్తుందని జాజిరెడ్డిగూడెం ఉమ్మడి మండల పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి తెలిపారు. ధాన్యాన్ని ఆరబెట్టి, తాలులేకుండా శుభ్రం చేసి కేంద్రానికి తేవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కేంద్రం ఇన్‌చార్జ్ ఆడెపు శ్రీకాంత్, రైతులు సూరారపు నాగయ్య, పాలబిందెల వెంకటయ్య, సాలయ్య, గిరి, చారి, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్(ఎస్) : మండల పరిధిలోని కందగట్లలో మంగలితండా రైతు ఉత్పత్తిదారుల సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్న వడ్ల కొనుగోలు కేంద్రాన్ని జిల్లా పౌర సరఫరాల అధికారి రాజేశ్వర్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి సకాలంలో కొనుగోలు కేంద్రానికి తరలించి విక్రయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి దివ్య, డిప్యూటీ తహసీల్దార్ హరిశ్చంద్ర ప్రసాద్, రైతులు శంకర్, వెంకన్న, శిగ శ్రీనివాస్, సత్తిరెడ్డి, మోహన్ రెడ్డి, జలంధర్ రెడ్డి, భూతం లింగయ్య పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి



ఈటూరులో నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

నాగారం : నాగారం మండల పరిధిలోని ఈటూరులో సన్నరకం ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతూ రైతులు ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మూడు వేల జనాభా కలిగిన గ్రామంలో ప్రభుత్వం సన్న రకం ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసే స్థలం వద్ద దాదాపు 200మంది రైతులు ధాన్యం పోసి ఎదురుచూస్తున్నారని తెలిపారు. వెంటనే కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి రైతుల ఇబ్బందులు తీర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు కన్నెబోయిన మల్లయ్య, మొగుళ్ల అంజయ్య, పిచ్చయ్య, దూదిగాని వెంకటయ్య, యల వెంకన్న, నరసింహస్వామి, కిష్టయ్య, సోమయ్య, నాగరాజు, సత్యమ్మ, మల్లేష్, మహేష్, ధనమ్మ, దుర్గమ్మ, సత్తెమ్మ, రమణ పాల్గొన్నారు.

నాసిరకం పనులు.. దెబ్బతిన్న రోడ్డు



తుంగతుర్తిలో కోర్టు ఎదురుగా ధ్వంసమైన రోడ్డు



తుంగతుర్తిలో బస్టాండ్ ఎదురుగా..

తుంగతుర్తి : మండల కేంద్రంలో నాసిరకం నిర్మాణంతో రోడ్డు దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. గత సెప్టెంబర్‌లో కురిసిన వర్షాలకు రోడ్డు దెబ్బతిని గుంతలు ఏర్పాడ్డాయి. అనంతరం ఆర్‌అండ్‌బీ అధికారులు పరిశీలించి దెబ్బతిన్న రోడ్డును మరమ్మతు చేయించేందుకు అక్టోబర్‌లో రూ.50వేల నిధులు కేటాయించి కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. సదరు కాంట్రాక్టర్ అక్టోబర్‌లో రోడ్డు మరమ్మతు చేయించాడు. అయితే పనులు చేపట్టి నెల రోజులు గడవకముందే రోడ్డు పూర్తిగా దెబ్బతిని గుంతలమయంగా మారింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి దెబ్బతిన్న రోడ్డును నాణ్యత ప్రమాణాలతో మరమ్మతు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

బీటీ రెన్యూవల్ ఎప్పుడో..?



కాసర్లపహాడ్ శివారులో ధ్వంసమైన రోడ్డు



కొమ్మాల వద్ద..

అర్వపల్లి : మండల పరిధిలోని ప్రధాన రహదారి అయిన అర్వపల్లి–కొమ్మాల బీటీ రోడ్డు కొన్నేళ్లుగా రెన్యూవల్‌కు నోచుకోక రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు ప్రస్తుతం బీటీ లేచిపోయి గుంతలు పడి అధ్వానంగా మారింది. ఈ రహదారిపై నిత్యం మూడు మండలాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. రహదారి కంపచెట్లతో అల్లుకపోయి గుంతలుపడి పాదచారులు సైతం నడిచివెళ్లలేని పరిస్థితి నెలకొంది. అర్వపల్లి నుంచి కొమ్మాల వరకు 9కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఈ రహదారిపై మూలమలుపులు కూడా ప్రమాదకరంగా మారాయి. ఈ రహదారి బీటీ రెన్యూవల్ కోసం గతంలోనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. కానీ ఇంతవరకు నిధులు మంజూరు కాకపోవడంతో రెన్యూవల్ పనులు జరుగక గుంతలతో వాహనచోదకులు, ప్రయాణికులు నిత్యం అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు బీటీ రెన్యూవల్ చేయించి ఇబ్బందులు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

మెడికల్ షాప్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడిగా సుమన్

మునగాల : మెడికల్ షాప్స్ అసోసియేషన్ మునగాల మండల అధ్యక్షుడిగా మునగాల మండల కేంద్రానికి చెందిన అమరగాని సుమన్ ఎన్నికయ్యారు. ఆదివారం మునగాలలో నిర్వహించిన అసోసియేషన్ సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు సుమన్‌ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ షాప్స్ అసోసియేషన్ సభ్యులు కాసర్ల నారాయణ, మండవ శ్రీనివాస్, శ్రీను, రామకృష్ణ, లేళ్ల మధు, అనిల్, అజయ్, మండవ వినోద్, సంగెపు ఉపేందర్, పలువురు అసోసియేషన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.